
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025
5
ఏలూరు



విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న సభ్యులు

చింతలపూడి : పది పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్ఎంసి ఛైర్మన్ జి.నాగరాజు, వైస్ ఛైర్మన్ డి.లలితకు అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం బాలికల పాఠశాల్లో గురువారం ప్రిన్సిపల్ ఎం.బ్రహ్మాజేశ్వరమ్మ అధ్యక్షతన పదోతరగతి విద్యార్థులు 81 మందికి ఎస్ఎంసి కమిటీ ఆధ్వర్యంలో 405 పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గత ఏడాది కంటే ట్రిపుల్ ఐటీలో ఎక్కువ సీట్లు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, రజని, రామకృష్ణ పాల్గొన్నారు.

నీళ్లివ్వరు.. నీడ చూపరు..!

మండుటెండలో ఉపాధి హామీ కూలీలు విలవిల

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధి హామీ కూలీలు మండుటెండలో మలమలా మాడిపోతున్నారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచే ఎండ తీవ్రత పెరగడంతో పని ప్రదేశాల్లో పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నీడ కోసం ఇవ్వాల్సిన పరదాలు మూడేళ్లపాటు ఇవ్వలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం గ్రామాల్లో అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. కూలీలకు సక్రమంగా వంద రోజులు కూడా పనులు కల్పించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇక వేసవి తీవ్రత నేపథ్యంలో మజ్జిగ, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయడంతోపాటు సమ్మర్ అలవెన్స్ అందించాల్సి ఉంది. రెండు పూటలా పని విధానం, ముఖ ఆధారిత హాజరు తీసివేయాలని కూలీలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉపాధి కూలీలు చేసిన పనులకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉండటం గోరుచుట్టుపై రోకలిపోటులా ఉందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

పందిళ్లు వేసుకోవాలంట..!

మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కాలువల పనులు చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి 12 వరకు పని చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఇటీవల గ్రామాల్లో చలువ పందిళ్లు వేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఏపిఒలకు ఆదేశాలు వచ్చాయి. కర్రలు, గడ్డి, తాటి కొమ్మలు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని ఉపాధి కూలీలు ప్రశ్నిస్తున్నారు. పైగా టెంట్లు ఇస్తే పని ప్రదేశాల్లో వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దానికి భిన్నంగా పందిళ్లు అంటే వేరే పని ప్రదేశాలకు తరలించేది ఎలాగని ప్రశ్నిస్తున్నారు.


ఏలూరుపాడు గ్రామంలో ఊర చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

గతంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ ఇచ్చేవారు. ప్రస్తుతం అవేవీ ఇవ్వడం లేదు. తాగునీటిని కూడా ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని కూలీలు వాపోతున్నారు. కాళ్ల మండలంలో 5,815 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

అందని వేతనాలు

ఉపాధి కూలీలకు చేసిన పనులకు సంబంధించిన కూలి సొమ్ము చాలా రోజులుగా చెల్లించలేదు. మండలంలో కూలీలకు రూ.56 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 15 రోజులకు ఒకసారి చెల్లించాల్సిన బిల్లులు రెండు నెలలు గడిచినా అందకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధుల విడుదలలో జాప్యంతో సమస్య వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

వాసా విజయ్ మణికంఠకుమార్, టెక్నికల్ అసిస్టెంట్, కాళ్ల

ఎండ తీవ్రత నుంచి ఊరట పొందడానికి పని ప్రదేశంలో పందిళ్లు వేసుకోవాలని ఆదేశాలొచ్చాయి. ఈ మేరకు క్షేత్ర సహాయకులకు తెలియజేశాం. కూలీలు ఎండ దెబ్బకు గురికాకుండా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

గిరిజనుడు యాకోబుపై దాడికి పాల్పడ్డ

రేంజర్, సబ్‌డిఎఫ్ఒలను సస్పెండ్ చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితునికి నేతల పరామర్శ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

గిరిజనుడు మడకం యాకోబుపై దాడి చేసిన అటవీ శాఖ కన్నాపురం రేంజర్ శివరామకృష్ణ, సబ్ డిఎఫ్ఒ వెంకటసుబ్బయ్యలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, తక్షణమే వారిద్దరిని సస్పెండ్ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, నేత కారం సత్యనారాయణ డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాకోబును గురువారం వారు పరామర్శించారు. అనంతరం రామకృష్ణ, సత్యనారాయణ మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలం గొల్లపూడి గ్రామానికి చెందిన మడకం యాకోబు గత ప్రభుత్వం అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం నాలుగు ఎకరాల పోడు భూమికి పట్టా పొందారని తెలిపారు. ఆ భూమిలోని కలపను తీయటానికి దొరమామిడి గ్రామానికి చెందిన గార్ల లాల్‌కు అనుమతి కోరగా రూ.50 వేలు డిమాండ్ చేశారని, ఆ సొమ్మును యాకోబు చెల్లించారని తెలిపారు. ఆ కలపను తరలిస్తుండగా కన్నాపురం అటవీ అధికారులు రంగంలోకి దిగి సీజ్ చేశారన్నారు. అనుమతులు ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు ఆపుతున్నారని విషయం తెలుసుకునేందుకు కన్నాపురంలోని రేంజర్ కార్యాలయానికి వెళ్లిన మడకం యాకోబును కన్నాపురం రేంజర్, సబ్ డిఎఫ్ఒ, విచక్షణారహితంగా కొట్టడమే కాకుండా కులం పేరుతో దూషించారని, ఈ క్రమంలో యాకోబు స్పృహ తప్పి పడిపోవడంతో బుట్టాయగూడెం హాస్పటల్‌కు తరలించారని తెలిపారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారని, ప్రస్తుతం యాకోబు అక్కడ చికిత్స పొందుతున్నారని చెప్పారు. అనుమతులు ఉండి సొమ్ము కట్టినా విచక్షణారహితంగా అటవీ అధికారులు దాడి చేయడమే కాకుండా దుర్భాషలాడిన ఇద్దరు అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు పోలోజు నాగేశ్వరరావు, సోయం శ్రీను, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


యాకోబును పరామర్శిస్తున్న గిరిజన సంఘం నేతలు

నిర్వాసితులను జూన్‌లోగా పునరావాస కాలనీలకు తరలించాలి

అధికారులకు పోలవరం ప్రాజెక్టు పరిశీలనాధికారి అభిషేక్ ఆదేశం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వచ్చే జూన్‌లోగా పునరావాస పరిహారం అందించిన నిర్వాసితులను వారికి నిర్దేశించిన పునరావాస కాలనీలకు తరలించాలని పోలవరం ప్రాజెక్టు పరిశీలనాధికారి అభిషేక్ అన్నారు. పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని నిర్వాసితులకు పునరావాసం, పురిహారానికి సంబంధించి సంబంధిత అధికారులతో స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. గోదావరి వరదలు వచ్చేలోపు జూన్‌లోగా ముంపు గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం, పరిహారం అందజేతకు ముందస్తు చర్యలు చేపట్టాలని అభిషేక్ ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపును గురయ్యే 15 హేబిటేషన్లలో ఆర్అండ్ఆర్ పూర్తికి కార్యాచరణ ప్రణాళికను ఈ నెల 20లోగా అందజేయాలని ఆదేశించారు. అనంతరం పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డిపేట పునరావాస కాలనీని సదరు అధికారులతో కలిసి సందర్శించారు.


మాట్లాడుతున్న అభిషేక్


వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పని భారం తగ్గించాలని కార్యదర్శుల వినతి

ప్రజాశక్తి - చింతలపూడి


పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాణి వసంత ప్రసాద్ కోరారు. తమకు పనిభారం తగ్గించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యాన పంచాయతీ కార్యదర్శులు గురువారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం కార్యదర్శులు 13 రకాల సర్వేలు చేస్తున్నారని, ఇంటి, నీటి పన్నులు వసూలు చేయడంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా 26 రకాలు సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడం వల్ల కార్యదర్శులు మానసికంగా, శారీరకంగా అలసిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు దళితులకు పంచాలి

ప్రజాశక్తి - దెందులూరు

దోసపాడు దళితులకు అసైన్మెంట్ భూములు 106.16 ఎకరాలు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. దోసపాడు దళితులు, పేదలు తమకు న్యాయం చేయాలని గత ఐదేళ్లుగా పోరాడుతున్నా.. న్యాయం జరగని పక్షంలో చివరకు జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు తమ సమస్యను పరిష్కరించాలని కోరగా కిందిస్థాయి నుంచి సమగ్ర రిపోర్టు కావాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మండల రెవెన్యూ శాఖ అధికారులు దెందులూరు ఆర్ఐ, దోసపాడు విఆర్ఒ సమక్షంలో దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితులకు న్యాయం చేయాలని, వారికి సంబంధించిన అసైన్మెంట్ సీలింగ్ భూములను వెంటనే అప్పజెప్పాలని గత ఐదేళ్ల నుంచి పోరాడుతున్నా పేదలకు పంచాల్సిన భూముల విషయంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. దోసపాడు పేదలు కోరుకున్నట్లుగా అసలైన అసైన్డ్‌దారుల వివరాలు రెవెన్యూ శాఖ అధికారులు నేటికీ బయట పెట్టకపోగా మాకు పైనుంచి ఎలాంటి ఆర్డర్లు ఇవ్వలేదని మాట మారుస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ఈ మండలంలో పనిచేసిన తహశీల్దార్ ఈ భూములు దోసపాడు దళితులు, పేదలవే అని, వారికి 1956 నుంచి 70 వరకు వివిధ సందర్భాల్లో డి నమూనా పట్టాలు ఇచ్చామని అధికారికంగా చెప్పినా నేటి తహశీల్దార్ ఆ విషయాలన్నీ పక్కన పెట్టేసి తన సొంతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, కోర్టు ఇచ్చిన ఆదేశాలను తుంగలో తొక్కి తన రాజకీయ బలబలాలను దృష్టిలో పెట్టుకొని దోసపాడు దళితులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో ఇచ్చిన లోకాయుక్త ఆర్డర్ తీర్పును అమలు చేయాల్సిన అధికారులే అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. అసలైన అసైండ్ దారులకు ఇవ్వాల్సిన ఫ్యామిలీ సర్టిఫికెట్స్, వారి వారసులుగా నిరూపించుకోవడానికి ఆధారమైన డెత్ సర్టిఫికెట్లను నేటికీ పంచాయతీ, రెవెన్యూ శాఖ అధికారులు ఇవ్వకపోవడం వల్ల పేదలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని మండిపడ్డారు. జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఇచ్చిన రిపోర్టును బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితిని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌కు పంపాలని, భూస్వాములతో కుమ్మక్కై తప్పుడు రిపోర్టులు పంపితే సహించబోమన్నారు. రాబోయే కాలంలో ఈ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డి.నాగేంద్ర, పంతగాని ఆనందరావు, దోసపాడు పోరాట నాయకులు సామ్యూల్, లక్ష్మి, మణి, మాణిక్యం, మరియమ్మ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ


దర్యాప్తు చేస్తున్న అధికారులు

యశ్వంత్ మృతిపై విచారణ చేపట్టాలి

డిఆర్ఒకు కెవిపిఎస్, దళిత నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో బాలుడు బంగారు యశ్వంత్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కెవిపిఎస్, దళిత సంఘాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ ఛైర్‌పర్సన్ ఆర్.మణిసింగ్ మాట్లాడుతూ 15 సంవత్సరాల వయస్సు గల బంగారు యశ్వంత్‌ను ఈ నెల ఐదో తేదీన ముగ్గురు పోలీసులు యశ్వంత్ ఇంటికొచ్చి దొంగతనం కేసులో అరెస్టు చేసి తీసుకెళ్తున్నామని నాయనమ్మకు చెప్పి, యశ్వంత్‌కు బేడీలు వేసి తీసుకెళ్లారన్నారు. విచారణ పేరుతో కోటదిబ్బలోని సిసిఎస్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారని, ఈ విషయం తెలిసి యశ్వంత్ నాయనమ్మ అక్కడికెళ్లి తన మనవడిని చూపించాలని ప్రాధేయపడిందన్నారు. అక్కడ లేడని చెప్పడంతో ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లకు వెళ్లగా అక్కడ లేరని చెప్పారని, దీంతో పెదవేగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా అక్కడ కూడా లేడని చెప్పారని తెలిపారు. ఈ నెల ఆరో తేదీ ఉదయం యశ్వంత్ విగతజీవిగా కాలువ గట్టుపై పడి ఉండగా చూసిన ఒక వ్యక్తి 108కి ఫోన్ చేస్తే వారొచ్చి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారని, పోస్టుమార్టం చేసే దగ్గర ఒక వ్యక్తి చూసి యశ్వంత్ బంధువులకు సమాచారం అందించారని వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేసే వెంటనే దహనం చేశారని, యశ్వంత్ మృతి విషయంలో సిసిఎస్ పోలీసులకు, ఆ స్టేషన్ సిఐకు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. అసలు మైనర్‌ను ఏదైనా కేసులో అరెస్టు చేస్తే జువైనల్ హోమ్‌కు పంపించాలిగాని కొట్టి చంపేయడమేంటని, పోలీసులకు ఆ హక్కు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా నాయకుడు ఎం.ఇస్సాక్ మాట్లాడుతూ యశ్వంత్ మృతిపై సరైన కోణంలో విచారణ జరిపి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లెనిన్, ప్రజాసంఘాల నేత గుడిపాటి నరసింహారావు, ఎస్‌సి, ఎస్‌టి హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతి అందిస్తున్న నేతలు

ఘనంగా మొల్లమాంబ జయంతి

యువతకు మొల్లమాంబ జీవితం ఆదర్శం - కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కవయిత్రి మొల్ల మాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత, విద్యార్థినీ విద్యార్థులు స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ బంగ్లా సమావేశ మందిరంలో కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు. రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా తక్కువ వ్యవధిలో రచించిన గొప్ప కవయిత్రి మొల్ల అని కొనియాడారు. ఆనాటి పరిస్థితులను ఎదుర్కొని సాహసోపేతంగా రామాయణం రచించారన్నారు. ఆమె పేరుతో ప్రభుత్వం స్టాంప్ కూడా రిలీజ్ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఆర్‌వి.నాగరాణి, బిసి కార్పొరేషన్ ఎడి ఎన్.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్


విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు అర్బన్ : రొయ్యకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు ధరను తగ్గించడం వల్ల రొయ్యల రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వనామి రొయ్యల ఫీడ్ ధర టన్నుకు టన్ను రూ.45 వేలు ఉంటే ప్రస్తుతం ఆ ధర రూ.లక్ష 5 వేలకు పెరిగిందని, పెరిగిన ఉత్పత్తి ఖర్చుకు అనుగుణంగా రొయ్యకు గిట్టుబాటు ధర పెరగలేదని అన్నారు. ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడం, మరోవైపు దిగుబడి కూడా తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రైతుకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్య రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాణ్యమైన సీడ్ అందించాలని, ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధర 1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపచేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఆగని బస్సు ప్రమాదాలు

అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

తృటిలో తప్పిన పెనుప్రమాదం.. సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి - కుక్కునూరు

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటన మండల పరిధిలోని చీరవల్లి గ్రామ సమీపంలోని పాలవాగు వద్ద గురువారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి నుంచి ప్రయివేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్తోంది. చీరవల్లి సమీపంలో పాలవాగు వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని అలానే నిలిచిపోయింది. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగకపోవడం, బస్సు పక్కకు బోల్తా పడకపోవడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదమూ చోటుచేసుకోలేదు. బస్సు నిర్వాహకులు కొద్దిసేపటి తర్వాత ఆ బస్సును అక్కడి నుంచి తరలించేశారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదూ అందలేదని పోలీసులు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్య ప్రకాష్ మాట్లాడుతూ తమతో ఉన్న న్యాయవాదికి జరిగిన అన్యాయం కు నిరసనగా విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో సైతం న్యాయవాదులు విధులను బహిష్కరించి తమ పోరాటానికి మద్దతు తెలిపినట్లు చెప్పారు. నూజివీడులో న్యాయవాదిగా వృత్తిని కొనసాగిస్తున్న వ్యక్తికే అన్యాయం జరిగితే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటనే ప్రశ్నించారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటుతూ ఫిర్యాదు చేస్తే, స్పందించవలసిన రీతిలో అధికారులు స్పందించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. న్యాయపరమైన పోరాటం చేస్తాం కానీ, బహిరంగ ఆందోళనలకు దిగబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి

జిల్లా ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



హాస్టల్లో విద్యార్థులకు సమతుల్యమైన పోషకాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం జెడి సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎస్‌సి, బిసి కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంటా పద్మశ్రీ మాట్లాడుతూ సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ, శుభ్రత, భద్రతాపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్లో విద్యార్థులకు సమతుల్యమైన పోషకాహారం అందించాలని తెలిపారు. పదవ తరగతి పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.భీమేశ్వరరావు, బిసి, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఎస్‌సి, బిసి కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు ఆదేశించారు. మండలంలోని బర్రింకలపాడు నుంచి దర్భగూడెం వరకు రూ.3.6 కోట్ల నిధులతో నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రావెల్‌ను పరిశీలించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాంబ, ఎస్.సత్యనారయణరాజు, రామ్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

'రాయితీపై కవర్లు పంపిణీ'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మామిడి రైతులకు రాయితీపై కవర్లు పంపిణీ చేయనున్నట్లు ఉద్యాన శాఖ అధికారి హేమ తెలిపారు. నూజివీడు పట్టణంలో హేమ గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మామిడి రైతులకు 50 శాతం రాయితీపై కవర్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం రైతు సేవా కేంద్రాలలో రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు పాసుపుస్తకం, ఆధార్, ఆధార్ లింకైన ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక ఎకరం మామిడి తోటకు 4 వేల కవర్లు రూ.8 వేలు ఖర్చు అవుతుందన్నారు. అందులో 50 శాతం సబ్సిడీపై కేవలం రూ.4 వేలకే అందించటం జరుగుతుందన్నారు. రెండు ఎకరాల మామిడి తోటకు ఎనిమిది వేల కవర్లు ఖర్చు రూ.16 వేలు అవుతుందని, 50 శాతం సబ్సిడీపై ఎనిమిది వేలకు 2.50 ఎకరాల మామిడి తోటకు పదివేల కవర్లు రూ.20 వేలు ఖర్చు కాగా 50 శాతం సబ్సిడీపై కేవలం రూ.10 వేలకే కవర్లు అందించటం జరుగుతుందని వివరించారు. ఇతర వివరాలకు 79950 86890 నంబర్‌లో రైతులు సంప్రదించవచ్చు అన్నారు.

నవోదయం 2.0 ప్రచార రథం ప్రారంభం

నూజివీడు టౌన్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నూజివీడులో నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 ప్రచార రథాన్ని ఎక్సైజ్ శాఖ సిఐ మస్తానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నవోదయం 2.0 గురువారం ప్రారంభించారని, ప్రతి గ్రామాలలో ప్రచార రథం ద్వారా సారా వల్ల కలిగే నష్టాలు, అదేవిధంగా ప్రభుత్వం తీసుకునే చర్యలు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో, 47 గ్రామాలలో నాటుసారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో నవోదయం 2.0 కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం చాలా అవసరమని, దానికి ప్రభుత్వం వారు రాష్ట్రవ్యాప్తంగా టోల్ ఫ్రీ నెంబర్ 14405 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రసాద్, ఈశ్వరరావు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏలూరు శ్రీలత అసిస్టెంట్ కమిషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కెవిఎన్.ప్రభుకుమార్ అన్నారు. మండలంలోని నామవారం గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పరచి నాటు సారా వల్ల జరిగే అనర్థాల గురించి విశ్లేషంగా గ్రామ ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. నవోదయ 2.0 కార్యక్రమ సాధనకై పాటుపడి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

గుండుగొలను వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

వంతెన సాధన కమిటీ కన్వీనర్ సుమన్ బాబు

దెందులూరు : గత మూడేళ్లగా నత్తనడకన సాగుతున్న గుండుగొలను వంతెన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గుండుగొలను వంతెన సాధన కమిటీ కన్వీనర్ టి.సుమన్ బాబు డిమాండ్ చేశారు. గురువారం గుండుగొలను గ్రామంలో ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణం జాప్యం అవడానికి కారణమైన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టేలా కలెక్టర్, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణం ఆలస్యం కావడంతో ఇప్పటి వరకు 23 మంది తీవ్రంగా గాయపడి, నలుగురు మృతికి కారణమైన కాంట్రాక్టర్‌కు తక్షణమే డిస్మిస్ చేయాలన్నారు. వాస్తవానికి ఆరు నెలల్లోనే వంతెన నిర్మాణం పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ తీవ్ర నిర్లక్ష్యం చేసారని పేర్కొన్నారు. అన్ని అడ్డంకులను దాటి స్లాబ్ వేయటానికి సిద్ధంగా ఉన్నా, కేంద్ర జల రవాణా శాఖ అనుమతులు నిరాకరణ పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తక్షణమే అనుమతులు ఇచ్చి వంతెన నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సుమన్ బాబు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

పీసా సభ్యులకు ప్రత్యేక శిక్షణా తరగతులు

పోలవరం: పంచాయతీలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా పెసా కమిటీ సభ్యులకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ తరగతులు గురువారం మండలంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ పల్లా త్రినాథ్ రావు, జిల్లా డిపిఆర్‌సి కార్యాలయం నుంచి ప్రసంగి, పరిశీలకులుగా సామర్లకోట ఇటిసి నుంచి డిఆర్ఎన్ పద్మజలు ముఖ్య అతిథులుగా హాజరై కమిటీ సభ్యులకు మార్గదర్శకత్వం అందించారు. ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

నేరాలు - ఘోరాలు

ఏలూరు స్పోర్ట్స్ : రోడ్డు భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అది విద్యార్థి దశనుంచే అందించాలనే ఉద్దేశంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రమేష్ బాబు తెలిపారు. ఏలూరు నగరంలోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణా

కుక్కునూరు : మండలంలోని వింజరం గోదావరి ఒడ్డు నుంచి గోవుల అక్రమ రవాణా కొనసాగుతుంది. గురువారం ఉదయం వింజరం గోదావరి నది దాటి పెద్ద ఎత్తున గోవులు తరలిరావడంతో ఇది గమనించిన స్థానికులు సచివాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సచివాలయ వెటర్నరీ సిబ్బంది వచ్చి వాటిని పరిశీలించిన తరువాత వారి వద్ద నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పైఅధికారులకు సమాచారం చేరవేశారు. అవి సుమారు 20 గోవులను తరలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి

మండవల్లి : ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతిచెందిన సంఘటన మండవల్లి మోటూరు రైల్వే స్టేషన్ల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. రైల్వే పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో కీమెన్ డ్యూటీ చేస్తు కెం నెం 51/7&9 మధ్యలో రైల్వే ట్రాక్ పక్కన 32 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ మృతిచెంది పడి ఉండడం గమనించారు. అనంతరం రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. స్టేషన్ మాస్టర్ అందించిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడటంతో తలకు బలమైన గాయం అయ్యి అక్కడికక్కడే మృతి చెందినట్లు గమనించారు. ఆమె ఒంటిపై మరూన్ కలర్ వివరాలు మాత్రం తెలియ రాలేదని తెలిపారు. మృతురాలు యొక్క ఆచూకీ తెలిసినవారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఫోన్ నెంబర్ 9440796570కు సమాచారం అందించాలని కోరారు.

రేషన్ బియ్యం నిల్వ : వ్యక్తిపై కేసు

ఏలూరు స్పోర్ట్స్ : అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఉంచిన వ్యక్తిపై విజిలెన్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు తంగెళమూడి 2 సచివాలయానికి పొరుగ్గి గోపి విజిలెన్స్ పనిచేస్తున్నారు. ఏలూరు రూరల్ పరిధిలోని బీడీ కాలనీ చెరువుగట్టు పైన ఎర్ర పూర్ణ కుమార్ అనే వ్యక్తి తన ఇంటిలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచడం గమనించారు. ఆయనను ఇంటిలో దాడి చేశారు. 310 కేజీల రేషన్ బియ్యం గుర్తించి వాటిని సీజ్ చేశారు. వీటి విలువ రూ.12,400 ఉంటుందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఏలూరు స్పోర్ట్స్ : ఇంటికి తాళాలు వేసుకుని బంధువుల ఆసుపత్రిలో ఉంటే చూసి రావడానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని దుండగులు వెండి ఆభరణాలు, నగదును దోచుకెళ్లిన ఘటన ఏలూరు రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రూరల్ మండలం కొమడవోలు ప్రాంతానికి చెందిన రాజాల సంధ్య రాధాకృష్ణులు ఫ్యామిలీతో కలిసి ఆటో ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంధ్య తన బంధువులను ఆరోగ్య గోపారెడిలు హాస్పటల్లో ఉండడంతో వారిని పలకరించడానికి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉంచవలసిన 14 తులాల వెండి ఆభరణాలు, 2 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్ఐ ద్రాక్షప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొద్దిపాటి సమయం ఎంతో కీలకం

ప్రజాశక్తి - మండవల్లి

2024-25 విద్యా సంవత్సరానికి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటి వరకు విద్యార్థులు తరగతిగదిలో నేర్చుకున్నది ఒక ఎత్తు అయితే ఇప్పటి నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు ఉన్న సమయం మరింత విలువైనది. ఈ కొద్దిపాటి సమయాన్ని కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే అత్యధిక మార్కులు సాధించవచ్చు. ఈనెల 17వ తేదీ నుంచి పదో

'పది' విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు

తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండవల్లి మండలంలో 7 ప్రభుత్వ, 3 ప్రయివేటు పాఠశాలలకు చెందిన 340 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరై పరీక్షలు రాయనున్నారు. అయితే గతేడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి, ఆయా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతి విద్యార్థి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి మరి ఆదనపు తరగతులను నిర్వహించి విద్యాబోధన చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా కమిటీలు అల్పాహారం అందించి ఉత్తీర్ణత శాతం పెంపుదలకు కృషిచేశారు.

రివిజన్‌తోనే అధిక మార్కులు

సమత, లెక్కల టీచర్



లెక్కల్లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయడానికి రివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. తెల్లవారుజామున లేచి తరగతి గదిలో చేసిన లెక్కలను మళ్లీ రివిజన్ చేసుకోవాలి. ఇంపార్టెంట్ లెక్కలపై మరింత దృష్టిపెడితే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేస్తే ఉత్తీర్ణులవుతారు.

పుస్తకాలపైనే దృష్టి పెట్టాలి

జి.దుర్గ, ఎన్ఎస్ టీచర్



విద్యార్థులు ఈ కొద్ది రోజులు టివి, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి. మైండ్ ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. ఒత్తిడికి గురికాకుండా టైంకి చదువుకోవాలి. ఒత్తిడికి గురైనట్లు అనిపిస్తే రెస్ట్ తీసుకోవాలి. సులభంగా జీర్ణం అయ్యే ఆహారాన్ని, పండ్ల రసాలను తీసుకోవాలి. ఈజీగా ఉండే ప్రశ్నలతో పాటు బొమ్మలను ప్రాక్టీస్ చేసుకోవాలి. ప్రతి విద్యార్థి 50 మార్కులకు 45పైనే మార్కులు ఈజీగా సాధించవచ్చు.

మోడల్ పేపర్లతో అధిక మార్కులు

శైలజ, సోషల్ టీచర్



సోషల్‌లో ఎక్కువ మార్కులు స్కోర్ చేయడానికి మోడల్ పేపర్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ సమయంలో పుస్తకాలతో పాటు ప్రతి మోడల్ పేపర్ సరిచూసుకోవాలి. ఉదయం 5 గంటలకు లేచి రాత్రి 10 గంటల వరకు చదువుకోవచ్చు. ఈ కొద్ది సమయం ఎంతో విలువైనది. సద్వినియోగం చేసుకుంటే సోషల్‌లో ఈజీగా ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలి : సిపిఎం

టి.నరసాపురం : మండలంలోని 15 గ్రామ పంచాయతీల గ్రామాల్లో ఉన్న ఉపాధి హామీ కూలీలందరికీ పనులు కల్పించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకటరావు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడెల్లి వెంకటరావు మాట్లాడుతూ మండలంలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, కనీసం రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 16న మండలంలో పాదయాత్రను చేపడుతున్నామని తెలిపారు. ప్రజాసమస్యలు పరిష్కారం చేయాలని నిర్వహిస్తున్న పాదయాత్ర జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని, తక్షణమే సూపర్ సిక్స్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, అనుమోలు మురళీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో 'సిగ్నస్ 25' ప్రారంభం

నూజివీడు టౌన్ : ఈనెల 14, 15 తేదీలలో జరగబోతున్న ఆర్‌జియుకెటి నూజివీడు వార్షిక సాంస్కృతిక మహోత్సవం సిగ్నస్ 25 హైడ్రోజన్ బెలూన్ లాంచ్‌తో ఘనంగా ఆరంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎఒ డాక్టర్ బి.లక్ష్మణ రావు, డిఎస్‌డబుల్యూ బాయ్స్ డాక్టర్ జె.సీతాపతి రావు, డిఎస్‌డబుల్యూ గర్ల్స్ డాక్టర్ టి.దుర్గా భవాని, సెంట్రల్ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ కెప్టెన్ డాక్టర్ సిహెచ్ సుబ్బలక్ష్మి, డాక్టర్ సూర్య, డెప్ట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వై.కళావతి పాల్గొన్నారు. రెండు రోజులు జరగబోతున్న ఈ మహోత్సవంలో ఎన్నో వినోదకరమైన గేమ్ స్టాల్స్, ఫుడ్ స్టాల్స్, సాంస్కృతిక కార్యకళాపాలు, మరెన్నో ఆసక్తికరమైన కార్యక్రమాలు ఉండబోతున్నాయి. ఇందులో భాగంగా తోలుబొమ్మలాట, ఫ్లాష్ మోబ్, క్యాంపస్ రేడియో, ఆర్కెస్ట్రా, బ్లైండ్ ఫోల్డ్ డ్యాన్స్, నవదుర్గ అష్టలక్ష్మి, హర్రర్ థీమ్ వంటి ఎన్నో ప్రదర్శనలు జరగబోతున్నాయి. 'రివైవింగ్ థి టైమ్లెస్ ట్రెడిషన్స్' థీమ్ అంటూ మన సంస్కృతి సాంప్రదాయాలను మేల్కొలపడం సిగ్నస్ 25 ముఖ్య ఉద్దేశం. సాంస్కృతిక కార్యక్రమాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడమే సిగ్నస్ 25 లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న మానవత సభ్యులు

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

పోలవరం : సేవా కార్యక్రమాలలో, విద్య, వైద్యం పట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుంటుందని ప్రధానోపాధ్యాయులు రాఘవన్ అన్నారు. తాళ్లపూడి, పోలవరం శాఖల ఆధ్వర్యాన గూటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి విద్యార్థులకు పరీక్షల విషయంలో పలు సలహాలు, సూచనలు అందించారు. పదవ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. విద్యార్థులకు ఫైల్స్, సర్టిఫికెట్లు, షీల్డ్స్, ఆంగ్ల పుస్తకాలు అందజేశారు. సాయి మాస్టారు విద్యార్థులందరికి పెన్స్, హాల్‌టికెట్‌లు అందించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సురేష్, పోసిబాబు, కోశాధికారి హనుమంత రావు, శేఖర్, బాలాజీ రాజేష్ పాల్గొన్నారు.

కిడ్నీపై అవగాహనా ర్యాలీ

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్ మాట్లాడుతూ 40 ఏళ్లు నిండిన వారు మూత్రపిండాల పరీక్షలు చేయించుకోవడం ఎంతో శ్రేయస్కరమన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు.

పోరాటాలతోనే మహిళల హక్కుల సాధన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆవిర్భావ దినోత్సవంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి



నినదిస్తున్న ఐద్వా నేతలు

ఐద్వా సంఘం ఏర్పడి 44 సంవత్సరాలైందని, మహిళల కోసం సంఘంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి కొన్ని చట్టాలను సాధించుకున్నామని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి, కమిటీ సభ్యులు జె.హరీశా దుర్గ తెలిపారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక పవర్ పేటలోని ఐద్వా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి సంఘం జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో శ్యామల రాణి, హరీశా దుర్గ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా చంటి పిల్లల నుంచి ముసలి వారి వరకు భద్రత కరువైందని అన్నారు. గుడి, బడి అనేది లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్మడం వల్ల మహిళలు ఇబ్బందులకు గురి అవుతున్నారని, అంతేకాక యువత స్మార్ట్ ఫోన్లతో చెడు మార్గం పడుతుందని, ఇలాంటి వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అలాగే రోజురోజుకీ పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల వల్ల మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దీనివల్ల మైక్రో ఫైనాన్స్ వద్ద అధిక వడ్డీకి డబ్బులు అప్పు తీసుకోవాల్సి వస్తుందని, డ్వాక్రా గ్రూపుల ద్వారా ప్రభుత్వమే తక్కువ వడ్డీలకి అప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.స్పందన, ఎం.అరుణ్ కుమారి, లక్ష్మి, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

రైతు సంఘం మండల కార్యదర్శి సీతారామయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద అందించే పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జీలుగుమిల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిందని, అయితే ఖరీఫ్ సీజన్ దాటి రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నా ఇప్పటికీ పెట్టుబడి సాయం అందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని కోరారు. అదేవిధంగా చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను ప్రారంభించి, పనులను త్వరితగతిన పూర్తిచేసి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం రైతులు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నా. మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి, రైతు సంఘం నాయకులు సుంకవల్లి శేషగిరిరావు, పడమటి వెంకన్నబాబు, నిమ్మగడ్డ దుర్గారావు, వలవల వెంకటేశ్వరరావు, జక్కుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రస్తుతం వ్యవసాయ శాఖ ద్వారా రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఇప్పటి వరకు మండలంలోని అన్ని గ్రామాలలో 6 వేల మందిని నమోదు చేసినట్లు వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. మండలంలోని రెడ్డి గణపవరం, బుట్టాయగూడెం గ్రామాలలో మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కొంతమంది రైతులు ఈ విశిష్ట నమోదు సంఖ్యను నమోదు చేయించుకోవాలని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య నమోదు ద్వారా పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలతో పాటు వ్యవసాయ, అనుబంధ శాఖలు అందించే ఇతర రాయితీలు, సేవలు రైతులకు అందించడం జరుగుతుందని, కాబట్టి సొంత వ్యవసాయ భూమి కలిగిన ప్రతి ఒక్క రైతు నమోదు చేయించుకోవాలన్నారు. అందుకుగాను ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

చింతలపూడి : 11050 మంది రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకున్నారని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా తెలిపారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా 2,500 మంది రైతులు చేయించుకోవలసి ఉందన్నారు. రైతులందరూ త్వరితగతిన నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎడిఎబి నాగ కుమార్, మండల వ్యవసాయాధికారి కె.మీనా కుమారి పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌కు సత్కారం

ఆగిరిపల్లి : అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవం సందర్భంగా గురువారం ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న బెహర ప్రసాద్‌ను వైద్యాధికారులు జాస్తి జగన్మోహన్‌రావు, షేక్ టీనా, వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ రత్నబాబు, ఎఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు

నేటి నుంచి రెడ్డిగణపవరం తిరుణాళ్లు

బుట్టాయగూడెం : మండలంలోని రెడ్డి గణపురంలో ఈనెల 14 నుంచి 5 రోజులు జరిగే శ్రీకనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి వార్షిక మహోత్సవాలకు, రెడ్డి గణపవరం తిరణాళ్లకు ప్రజలందరూ సహకరించాలని ఎస్ఐ దుర్గ మహేశ్వరరావు కోరారు. రెడ్డి గణపవరం మీదగా వెళ్లే భారీ వాహనాలకు 14 తేదీ నుంచి ప్రవేశం లేదని వాహనదారులు గమనించాలని కోరారు. ఈ తిరునాళ్లల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఫైలేరియా నిర్మూలనకు చర్యలు

వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ

జీలుగుమిల్లి : ఫైలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి వి.పెద్దిరాజు తెలిపారు.గురువారం ఫైలేరియా నిర్మూలన కార్యక్రమం లో భాగంగా మండలం లోని జీలుగుమిల్లి, కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులు 5 గురికి ఉచితంగా ఫైలేరియా నివారణ కిట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధి ప్రబలకుండా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమం లో వైద్యాధికారులు గాయత్రి, హేమలత, సిహెచ్ ఓ సరోజిని,సిబ్బంది జోగమ్మ,నాగరత్నం, హెల్త్ అసిస్టెంట్ లు ప్రసాద్,వెంకటేష్, వసంత్ బాలాజీ,రవీంద్ర పాల్గొన్నారు..

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని కోనేరు పేటలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యుపిహెచ్‌సి)లో బోదకాలు వ్యాధిగ్రస్తులకు గురువారం కిట్లు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొలుసు సౌమ్య మాట్లాడుతూ బోదకాలు వ్యాధిగ్రస్తులు పరిశుభ్రం చేసుకునేందుకు టబ్, టవల్, సబ్బు, ఆయింట్మెంట్, మగ్‌లను కిట్ రూపంలో అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరి ఆరోగ్యమే లక్ష్యంగా కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా బోదకాలు వ్యాధిగ్రస్తులకు పరిశుభ్రం చేసుకునే పద్ధతి వివరించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యత చేపట్టినట్లు తెలిపారు. అన్ని రకాలుగా నేడు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎల్లవేళలా వైద్య సేవలు అందించేందుకు అనుభవజ్ఞులైన వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ రవీంద్ర, హెచ్‌వి.కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

టి.నరసాపురం : ఫైలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని మండల వైద్యాధికారి ఆర్.ఫణీంద్ర బాబు తెలిపారు. జాతీయ ఫైలేరియా(బోదకాలు) నివారణా కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలుగు సచివాలయాలలో నమోదైన ఐదు ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు మందులు, మెటీరియల్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా (బోదకాలు) వ్యాధి క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల వ్యాప్తి చెందుతుందని ఆయన తెలిపారు. క్యూలెక్స్ దోమ ఇంటి పరిసరాల్లోని మురుగు నీటిలో నిల్వ వుంటుందన్నారు. రాత్రి వేళల్లో మనిషి నిద్రపోయిన తరువాత క్యూలెక్స్ దోమ కుడుతుందని, క్యూలెక్స్ దోమ కుడితే తరచూ జ్వరం రావడం, గజ్జల్లో బిళ్ల కట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయని, వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్‌ని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫైలేరియా వ్యాధి కాలు, చెయ్యి మొదలైన భాగాల్లో వస్తుందన్నారు. వ్యాధి తీవ్రత పెరగకుండా రోజుకు మూడు మాత్రలు చొప్పున 12 రోజుల కోర్సు ఆరు నెలల పాటు వాడాలన్నారు. ఈ మాత్రలతో పాటు రెండు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు పి.మావుళ్లమ్మ, ఎండిఎ ఎస్ బేగ్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్ ప్రశాంతి సస్పెండ్

ప్రజాశక్తి - చాట్రాయి

మండల తహశీల్దార్‌గా గత ఆరు నెలల క్రితం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ డి.ప్రశాంతి సస్పెండ్‌కు గురైయ్యారు. ఉద్యోగ విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, పై అధికారులను లెక్కచేయని నియంతపోకడ, వ్యవసాయ భూములు తారుమారు చేయడం, ఇలాంటి ఆరోపణలు సంబంధిత అధికారుల దృష్టికి ప్రజలు ఫిర్యాదు చేయడంతో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. జిల్లా కలెక్టర్ రెండుసార్లు తహశీల్దార్‌ను హెచ్చరిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేసినా కూడా తహశీల్దార్‌లో మార్పు కనిపించకపోవడంతో సస్పెండ్ ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలియజేశారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

కొయ్యలగూడెం : తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ తెలుగువారికి గర్వకారణంగా నిలిచిందని కుమ్మరి ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. గురువారం మొల్ల జయంతిని పురస్కరించుకుని నవ్యాంధ్రప్రదేశ్ కుమ్మరి యువసేన, కొయ్యలగూడెం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కుమ్మరి మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తుగ్గలి నాగేంద్ర దంపతులు పాల్గొన్నారు. పద్నాల్గవ శతాబ్దంలో తొలి తెలుగు మహిళా కవయిత్రిగా కుమ్మరి కులంలో పుట్టిన మొల్లమాంబ ప్రఖ్యాతిగాంచారని, ఆమె కవితలు ఎంతో సరళంగా సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉండడం విశేషమన్నారు. సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులో అనువదించి చరిత్రలో నిలిచిందని, అప్పటి నుంచి మొల్ల రామాయణంగా పిలవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కుమ్మరి సోదరులు వారి వృత్తిలో ఎదురయ్యే సమస్యలను వారికి తెలియజేయగా తొందరలోనే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు : మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కేవీ కవ్వగుంట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈనెల 14వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెఎం.అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కవ్వగుంట సబ్ స్టేషన్ పరిసర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఐ

నూజివీడు టౌన్ : మహాశివరాత్రి తిరునాళ్ల సందర్భంగా మృతిచెందిన కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు డిమాండ్ చేశారు. ఈమేరకు నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ రాజ్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ పరిధిలోని ముసునూరు మండలం బలివే గ్రామంలో మహాశివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన తిరునాళ్లలో అధికారుల సమన్వయ లోపంతో ముగ్గురు యువకులు మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆ కుటుంబాలకు కావలసిన సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిపిఐ ఏరియా నేతలు నిమ్మగడ్డ నరసింహ, ఆనంద్ పాల్గొన్నారు.